క్లుప్తంగా

డీజీపీని కలిసిన ఏఐసీసీ కోఆర్డినేటర్ 'తుల'



శివధర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న అరుణ్‌కుమార్

బోథ్: డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.శివధర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆయన కార్యాలయంలో ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు

బోథ్/భీంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీతో అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఏఐసీసీ పిలుపుమేరకు బోథ్ మండల కేంద్రం, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, మహమూద్, నాయకులు దాసరి రమేశ్, రేణిగుంట్ల శ్రీనివాస్, గోవర్ధన్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఉట్నూర్‌రూరల్: స్థానిక రైతు వేదికలో మంగళవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుండాల అశోక్, అధ్యక్షుడిగా పూసం జైతు, ప్రధాన కార్యదర్శిగా అసనూరి శ్రీను, ఉపాధ్యక్షులుగా ఆత్రం సోము, మడావి సోము, కోశాధికారిగా నైతం సోము, కార్యదర్శిగా మెస్రం రాజు, సహాయ కార్యదర్శులుగా సిడం రమేశ్, సభ్యులుగా చాహకటి లాలశావ్, ఆత్రం సోనేరావు, ఆత్రం లక్ష్మణ్, అర్క ప్రకాశ్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు సెడ్మాకి రామారావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో నాయకులు అరేం భీంరావ్, మెస్రం మోహన్, అర్కా ఒమేష్, ఆత్రం భీంరావ్ పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

నేరడిగొండ: ప్రతి రైతు బాధ్యతగా పంట నమోదు చేసుకోవాలని ఏవో కృష్ణవేణి అన్నారు. మండలంలోని బుద్దికొండ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఏఈవోలు శ్యామ్, జైపాల్, గజేందర్, అపర్ణ, స్వర్ణలత, సౌజన్య, రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బోథ్: మొక్కజొన్న, సోయాబీన్ పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్కెట్‌లో దళారులు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పంటలకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజు, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ రమణాగౌడ్, మాజీ ఆత్మ చైర్మన్ సుభాష్, బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

సాత్నాల: భోరజ్ మండలం పెండల్‌వాడలో మంగళవారం వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. టాప్రే చరణ్(7), టాప్రే కార్తీక్ (7) సాయంత్రం ఆడుకుంటుండగా, కుక్కలు గుంపుగా వచ్చి వారిపై దాడి చేసింది. స్థానికులు కుక్కలను తరిమి వారిని రక్షించి ఆసుపత్రికి తరలించారు. అలాగే మేక, లేగదూడపై సైతం దాడి చేశాయి.

కలప, ఫర్నిచర్ స్వాధీనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని పలు కాలనీల్లో ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి అక్రమ టేకు కలపతో ఫర్నిచర్ తయారు చేస్తున్న కరీం, మధును అరెస్ట్ చేసినట్లు జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర తెలిపారు. రూ.88 వేలు విలువ గల కలప, ఫర్నిచర్ స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఆర్వో కవిత అమర్ సింగ్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ కాదు..ఏరియాస్పత్రి

- బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసిన గత ప్రభుత్వం
- మౌలిక వసతులకు రూ.17.50 కోట్లు మంజూరు
- రెండేళ్లయినా నియామకం కాని సిబ్బంది
- కాగితాలకే పరిమితమైన జీవో



బోథ్‌లోని ఆసుపత్రి

ఏరియాస్పత్రిగా అప్‌గ్రేడ్ అయితే..

స్పెషలిస్ట్	ఉండాల్సిన సిబ్బంది
జనరల్ మెడిసిన్	3
జనరల్ సర్జరి	3
గైనకాలజిస్ట్	3
శిశువైద్య నిపుణులు	3
ఎనస్థీషియాలజిస్ట్	2
ఆర్థోపెడిక్	1
దంతవైద్య నిపుణులు	1
మెడికల్ ఆఫీసర్లు	6
నర్సింగ్ సిబ్బంది	35
ల్యాబ్ టెక్నీషియన్లు	4
ఫార్మసిస్ట్‌లు	4
రేడియోగ్రాఫర్లు	2
అడ్మినిస్ట్రేటివ్ అధికారులు	1
రికార్డ్స్, అటెండెంట్లు, శానిటేషన్ సిబ్బంది	30

బోథ్: నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) కాదు. అది వంద పడకల ఏరియాస్పత్రిగా గత ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 2023 ఆగస్టు 3న జీవో ఆర్టీ నంబర్ 431 జారీ చేసింది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.17.50 కోట్లు కేటాయించినట్లు జీవోలో పేర్కొంది. నిధులు కేటాయించినప్పటికి జీవో కేవలం కాగితాలకే పరిమితమైంది. వంద పడకల సదుపాయం, వైద్యపరికరాలు, సిబ్బంది నియామకం వంటి ఇప్పటివరకు కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రిమ్స్‌కు రిఫర్..

బోథ్‌లోని ప్రస్తుత (సీహెచ్‌సీ) కేవలం నామమాత్రంగా కొనసాగుతోంది. అరకొర సిబ్బంది, వసతుల లేమి కారణంగా వైద్యులు సైతం ఇక్కడ చికిత్స అందించడానికి ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో రోగులు సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొన్ని క్లిష్టమైన కేసులను తరచూ ఆదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. అదేవిధంగా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సీహెచ్‌సీని ఏరియాస్పత్రిగా జారీ అయిన జీవోను అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ నిబంధనల ప్రకారం సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొంటున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



సీహెచ్‌సీలో అత్యవసర కేసులు వస్తే వైద్యులు రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. సీహెచ్‌సీని ఏరియాస్పత్రిగా మారిస్తే మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి. రాష్ట్ర ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పించాలి. – సిరిపురం రాజశేఖర్, బోథ్

మూగజీవాలు బలి

- పశువులకు ప్రబలుతున్న లంపీస్కిన్, గాలికుంటు వ్యాధులు
- వ్యాధి బారినపడి మృత్యువాత
- ఆందోళనలో పెంపకందారులు



డొంగర్‌గామ్‌లో మృతి చెందిన లేగదూడ

ఇంద్రవెల్లి: గ్రామాల్లో మూగజీవాలకు లంపీస్కిన్, గాలికుంటు, జబ్బువాపు వ్యాధులు ప్రబలుతున్నాయి. వాటి బారినపడి మృత్యువాత పడుతున్నాయి. ఇంద్రవెల్లి, డొంగర్‌గామ్, గౌరపూర్, వాల్గొండ, వడగామ్, హీరపూర్, భీంజీతండా, కేస్లాపూర్, దస్నాపూర్ తదితర గ్రామాల్లో పదులు సంఖ్యలో చనిపోతున్నాయి. సరిగ్గా మేత తినక, నీళ్లు తాగక తమ కళ్ల ముందే మృత్యువాతపడడంతో రైతులు, పశు పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధుల బారినపడిన పశువులకు చికిత్స అందించాలని పశు వైద్యులను కోరిన పట్టించుకోలేదని వాపోతున్నారు. దీంతో తమకు తెలిసిన నాటువైద్యం అందించిన అవి ప్రాణాలు దక్కడం లేదు.

నెల వ్యవధిలో 20 పశువులు మృతి

డొంగర్‌గామ్ గ్రామంలో 75 ఆదివాసీ కుటుంబాలు ఉండగా, ప్రతి ఇంట్లో రెండు నుంచి ఐదు పశువులు, ఎడ్ల జతలు మొత్తం 200లకు పైగా ఉన్నాయి. పశువులు లంపీస్కిన్, గాలికుంటు, జబ్బువాపు వ్యాధుల బారిన పడ్డాయి. గతనెల వ్యవధిలో 20కి పైగా మృత్యువాత పడ్డాయి. మడావి సురేష్, మడావి శంకర్, పెందోర్ చిత్రు, కోవ రామ్‌షావ్, ఆర్క జగ్గేరావ్, మడావి సుదర్శన్, ఆర్క సెడ్మరావ్, పెందోర్ గోవింద్‌లకు చెందిన ఆవులు, ఎడ్లు, లేగదూడలు చనిపోయాయి. అనారోగ్యంతో బారినపడి పశువులు మృతిచెందిన ఈ విషయాన్ని గ్రామస్తులు పశువైద్యాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. తమ వద్ద ఎలాంటి మందులు లేవని చెబుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైన గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువుల మరణాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోలేదు



నెలలో పదుల సంఖ్యలో పశువులు మృతి చెందాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదు.
– అర్క సెడ్మరావ్, రైతు, డొంగర్‌గామ్

నా దృష్టికి రాలేదు

డొంగర్‌గామ్‌లో వ్యాధి బారినపడి పశువులు మృతి చెందిన విషయం నా దృష్టికి రాలేదు. పశువులు వ్యాధికి గురైన గ్రామాలను సందర్శించి వైద్యం అందిస్తాం.
– సుభాష్, పశు వైద్యుడు, ఇంద్రవెల్లి

అదుపుతప్పి ఎడ్లబండి వాగులో పడి..



వాగులో పడిన ఎడ్లబండి

బోథ్: మండలంలోని నక్కలవాడ గ్రామంలో గల లోలెవల్ వంతెన వద్ద సోయా పంటతో వెళ్తున్న ఎడ్లబండి అదుపుతప్పి వాగులో పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మర్లపల్లికి చెందిన రైతు లాడేవార్ సంజీవ్.. నక్కలవాడ శివారులో ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తుండగా, రెండెకరాల్లో సోయా పండించాడు. మంగళవారం సోయా పంటను ఎడ్లబండిపై గ్రామానికి తరలిస్తున్నారు. కరత్వాడ ప్రాజెక్టు వెనుక భాగంలో నక్కలవాడ వెళ్లే లోలెవల్ వంతెన దశాబ్దాలుగా ప్రమాదకరంగా ఉంది. ఓవైపు గుంతలు పడి, రాళ్లు తేలి ఉంది. ఈక్రమంలో వంతెన వద్ద చేరుకోగానే ఎడ్లబండి అదుపు తప్పింది. ఎద్దులు, ఎడ్లబండితో పాలేరు సోమన్న వాగులో పడిపోయారు. ఆయన ఈదుకుంటూ సురక్షితంగా బయటపడ్డాడు. ఎద్దులు ఈదుతూ ఒడ్డుకు చేరాయి. నీటిలో మునిగిన ఐదు క్వింటాళ్ల సోయాను స్థానికులు బయటకు తీశారు. మొత్తం రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ వేడుకలు



ధమ్మవందనం సమర్పిస్తున్న బౌద్ధ ఉపాసికులు

అదిలాబాద్‌రూరల్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: 69వ ధమ్మచక్ర పరివర్తన్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్ వద్ద భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ హాజరై మాట్లాడారు. 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దీక్ష భూమిలో డా భీంరావ్ రాంజీ అంబేద్కర్ 5 లక్షల జనంతో బౌద్ధ మతాన్ని స్వీకరించారని తెలిపారు. నాటి నుంచి ఏటా ధమ్మచక్ర పరివర్తన్ వేడుకలు జరుపుకుంటామన్నారు. సమసమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో దయానంద్, కాంతారావు వాగ్మారే, కుష్వర్త లాండ్గే, రాందాస్ భలేరావు, హట్కర్ రాజు, సందీప్ దాండ్గే తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్(బి) గ్రామంలోని సాకేత్ బుద్ధ విహార్‌లో, ఇంద్రవెల్లి మండలకేంద్రంలో ధమ్మ చక్ర పరివర్తన్ వేడుకలు నిర్వహించారు. గౌతమ బుద్ధుడి బాటలో నడవాలని బౌద్ధ భిక్షువులు బుద్ధగోశ్, అరియా పేర్కొన్నారు. బౌద్ధ ఉపాసికులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



విద్యార్థితో చదివిస్తున్న ఎంఈవో అనిత

నార్నూర్: ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాంను పకడ్బందీగా అమలు చేయాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. మండలంలోని తాడేహత్నూర్ ఎంపీపీ ఎస్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో ఇంగ్లిష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాం అమలు తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థులతో చదివించారు. ఈ ప్రోగ్రాం అమలు తీరు పరిశీలించేందుకు బుధవారం మండల కేంద్రానికి కలెక్టర్ రానున్నట్లు తెలిపారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జాదవ్ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు రాథోడ్ జితేందర్ తదితరులు ఉన్నారు.

కుంరం సూరు వర్ధంతిని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి పంచాయతీ పరిధి కొలాంగూడలో ఈనెల 17న నిర్వహించే కుంరం సూరు 28వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావ్, వర్ధంతి వేడుకల కార్యనిర్వాహక కన్వీనర్ కుమ్ర రాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం దళిత సంఘాల నాయకులతో కలిసి వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. కుంరం సూరు యువసేన జిల్లా నాయకుడు భీంరావ్, బాబూ జగ్జీవన్‌రాం అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, ఎస్సీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు జాదవ్ సాంబశివ్‌రావ్ పాల్గొన్నారు.

భోగి పూజతో దండారీ ఉత్సవాలు



పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: మండలంలోని ఎంపల్లి గ్రామంలో మంగళవారం భోగి పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. గుస్సాడీ టోపీలు, వాయిద్యాలకు ఆదివాసీ గిరిజనులు పూజలు చేశారు. గ్రామపటేల్ పెందూర్ అమృత్‌రావు, గ్రామపెద్దలు పెందూర్ సంతోష్, చిత్రు, రాము, పెందూర్ అనందరావు, పూసం బాదిరావు, కొట్నాక్ భీంరావు, మాడవి జలపత్‌రావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

రిమ్స్‌లోని మెడికల్ షాపుపై చర్యలు

- వారం పాటు మూసివేత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలోని మెడికల్ షాప్‌పై ఔషధ నియంత్రణ శాఖ ఏడీ నర్సయ్య చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఇటీవల రిమ్స్‌లోని మెడికల్ షాపులను తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ షాపులో మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వకపోవడం, రికార్డులు సరిగా లేకపోవడం తదితర లోపాలను జిల్లా పాలనాధికారి గుర్తించారు. తనిఖీలు చేపట్టాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతను ఆదేశించారు. దీంతో ఆమె షాపును తనిఖీ చేసి లోపాలను ఔషధ నియంత్రణ ఏడీకి నివేదించారు. దుకాణాదారుడికి నోటీసులు జారీ చేశారు. వివరణ అనంతరం మంగళవారం ఏడు రోజుల పాటు షాపును మూసి ఉంచాలని ఆదేశించారు.

నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మంత్రాల నెపంతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కలీంను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలిక అనారోగ్యం బారినపడింది. తాయత్తు, మంత్రాలతో నయం చేస్తానని నమ్మబలికి ఈనెల 11న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తి..

బజార్‌హత్నూర్: చిట్టీల పేరుతో మోసానికి పాల్పడ్డ వ్యక్తిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్‌రావ్, ఎస్సై సంజయ్ కుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రాజు గత రెండేళ్లుగా గ్రామంలో చిట్టీలు నడుపుతున్నాడు. పలువురి నుంచి రూ.15 లక్షలు చిట్టీలు కట్టించుకుని తిరిగి చెల్లించకుండా మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మోసానికి పాల్పడ్డ ఎడ్ల రాజును అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్లాంకెట్ల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రి ఆవరణలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మంగళవారం బ్లాంకెట్లు పంపిణీ చేశారు. జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉంటుందని వారికి తోచినసాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ అధ్యక్షుడు కొమ్ము రాము తెలిపారు. భగవాండ్లు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా అకాడమీ సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా స్టేడియంలో నిర్వహిస్తున్న నాగోబా అకాడమీ ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ కోరారు. మంగళవారం నాగోబా క్రీడా, పోలీసు రిక్రూట్‌మెంట్ అకాడమీని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల యువత, విద్యార్థుల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు మెస్రం నాగ్‌నాథ్, కొట్నాక్ బారిక్‌రావ్, యువకులు ఉన్నారు.

అడుగుకో గుంత



తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామం నుంచి అర్లి(టి) వరకు గల మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు అడుగుకో గుంతలుగా మారి వాహనాలు వెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. 4 కి.మీ దూరాన ఉన్న గ్రామానికి చేరేందుకు 40 నిమిషాల సమయం పడుతుండగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో గ్రామస్తులు ఈ రోడ్డుపై ప్రయాణం సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పనులు పూర్తయ్యేదెప్పుడో..



తాంసి: తాంసి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో గతేడాది క్రితం డార్మెంటరీ నాలుగు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 లక్షలు కేటాయించింది. కాంట్రాక్టర్ మధ్యలో పనులు వదిలేయడంతో అసంపూర్తిగా ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పూడిక తొలగించరూ..



సాజ్‌పూర్‌లో మట్టితో నిండిపోయిన డ్రైనేజీ

సాత్నాల: భోరజ్ మండలంలోని సాజ్‌పూర్, మండగడ గ్రామాల్లోని డ్రైనేజీల్లో పూడిక నిండింది. రోడ్లపై మురుగునీరు చేరడంతో దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు డ్రైనేజీల్లో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రహదారి ఇలా..వెళ్లేదెలా ?



సాత్నాల: సాత్నాల ప్రాజెక్టుకు ఆనుకొని కుడి కెనాల్ ముందుభాగం భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. వెంటనే మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ఆదిలాబాద్: ప్రతి ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం సీపీఆర్ అవగాహన వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు అవగాహన వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఆర్ ప్రాముఖ్యతను వివరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా సీపీఆర్ చేసే విధానంపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి సుమలత, జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్ మెట్పెల్లివార్, పుత్లిబౌలి పీహెచ్‌సీ వైద్యాధికారి జుబేరియా మహి, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, దేవిదాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చునని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ మహేశ్ అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, నర్సాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఆత్రం భాస్కర్, ఏఎన్‌ఎంలు జారుబాయి, నీలలు ఉన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని సిరికొండ బస్టాండ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో సీహెచ్‌వో బ్రహ్మానందరెడ్డి, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ల్యాబ్ టెక్నీషియన్లకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ల్యాబ్ టెక్నీషియన్లుగా నియామకమై విధుల్లో చేరిన వారికి జిల్లా కేంద్రంలో తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిజామొద్దీన్ మాట్లాడుతూ కోర్టు కేసు కారణంగా ఉద్యోగంలో చేరడానికి జాప్యం జరిగిందని తెలిపారు. 17 మంది ఇటీవల నియామకమైనట్లు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

తలమడుగు: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం ప్రత్యూష అన్నారు. మంగళవారం బరంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పాఠశాలపై కళాజాత బృందం సభ్యులతో అవగాహన కల్పించారు.

పరామర్శ

బేల: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలోని శంషాబాద్‌కు చెందిన కౌలు రైతు కోడె గోవింద్ ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ప్రమోద్, అక్షయ్ ఉన్నారు.

నేడు కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం

నేరడిగొండ: డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులు బుధవారం వస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ తెలిపారు. ఇచ్చోడలోని ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగానికి చెందిన గజానన్ అంకట్వార్ నూతన సిలబస్‌కు అనుగుణంగా రచించిన ఫండమెంటల్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

పెన్షన్ కోసం ప్రదక్షిణలు

జైనథ్: సాంగ్వి(కె) గ్రామానికి చెందిన మోహన్ పవర్, లక్ష్మీ పవర్ దంపతులకు పెన్షన్ కోసం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ రెండేళ్లుగా ప్రదక్షిణ చేస్తున్నారు. మంగళవారం అక్కడ పడిగాపులు కాసిన అధికారులు పట్టించుకోవడంలేదని వారు వాపోయారు.